క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

నెహ్రూసెంటర్ : జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ద్వారా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్‌లో ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు(1) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ మురళీధర్ శనివారం తెలిపారు. డీఎంఎల్‌టీ, బీఎస్సీ ల్యాబ్ టెక్నీషియన్ అర్హత గల పారామెడికల్ బోర్డులో రిజిస్ట్రేషన్ చేసుకుని 18 నుంచి 46 ఏళ్ల వయస్సు కలిగిన వారు అర్హులన్నారు. డీఎంహెచ్‌ఓ మహబూబాబాద్ పేరిట ఎస్సీ, ఎస్టీ, బీసీ రూ. 250, ఇతరులు రూ.300 డీడీ చెల్లించి ఈనెల 6వ తేదీ లోపు జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

ల్యాప్‌టాప్ అందజేత



కొత్తగూడ : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన భాశ్య స్వరూప ఉన్నత చదువుల కోసం ల్యాప్‌టాప్‌ను ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో శనివారం అందజేశారు. ల్యాప్‌టాప్ అవసరం ఉండి కొనుగోలు చేసేందుకు ఆర్థిక స్తోమత లేదని తెలుసుకున్న మంత్రి సీతక్క విద్యార్థి తండ్రికి ల్యాప్‌టాప్ అందించారు.

హక్కులను రక్షించుకోవాలి



గూడూరు : పౌర హక్కులను ప్రతీ ఒక్కరు రక్షించుకోవాలని తహసీల్దార్ శ్వేత అన్నారు. మండల కేంద్రంలోని చెంచ్చుగూడెంలో శనివారం పౌరహక్కుల పరిరక్షణ దినోత్సవం సందర్భంగా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం తత్వాన్ని అలవాటు చేసుకుని హక్కులను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై బి.గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన

నర్సింహులపేట : మండలంలోని జయపురం లో ఎస్సీ, ఎస్టీ, పీఓఏ చట్టాలపై గ్రామస్తులకు శనివారం అధికారులు అవగాహన కల్పించారు. తహసీల్దార్ నాగరాజు, ఎస్సై సురేష్, ఎంపీఓ యాకయ్య ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీ

కేసముద్రం : మండలంలోని మోడల్ స్కూల్‌లో ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఎర్రయ్య, ఎంఈఓ కాలేరు యాదగిరి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని వారు పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని వడ్డించాలని వారు ఆదేశించారు.

సైనికా..సెలవిక..

● అశ్రునయనాలతో ఆర్మీ జవాన్ అంత్యక్రియలు



డోర్నకల్ : గండెపోటుతో కలకత్తాలో మృతి చెందిన డోర్నకల్‌కు చెందిన ఆర్మీ జవాన్ కొదిరి పాల్ సతీశ్ అంత్యక్రియలు శనివారం డోర్నకల్‌లో నిర్వహించారు. శుక్రవారం రాత్రి డోర్నకల్‌లోని తన స్వగృహానికి చేరుకున్న సతీశ్ మృతదేహాన్ని అధిక సంఖ్యలో ప్రజలు సందర్శించి నివాళులర్పించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సత్యావతిరాథోడ్ సతీశ్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఎం తదితర పార్టీల నాయకులు నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. యాదవనగర్ శ్మశానవాటికలో ఆర్మీ సిబ్బంది సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



రాజు (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ మండలంలోని సోమ్లా తండా గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై దీపికారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సోమ్లా తండాకు చెందిన గుగులోత్ రాజు (47) అప్పుల బాధతో మనోవేదనకు గురై ఈనెల 17న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మనస్తాపంతో యువకుడు..

నెల్లికుదురు : మండలంలోని ఎర్రబెల్లిగూడెం గ్రామానికి చెందిన గడ్డం రాజు (24) మద్యానికి బానిసయ్యాడు. పొలం పనులకు రావాలని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెందిన రాజు శుక్రవారం పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రాజు తండ్రి వెంకన్న తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్సై రమేష్ బాబు పేర్కొన్నారు.

ధాన్యం కొనేదెప్పుడో!

కంఠాయపాలెంలో ప్రారంభం కాని కొనుగోలు కేంద్రం

● ప్రైవేట్ వ్యాపారులకు విక్రయాలు
● రూ.500 బోనస్ నష్టపోతున్న రైతులు
● స్థలం లేదని ప్రారంభించని ఐకేపీ సిబ్బంది



కంఠాయపాలెంలో నిల్వ ఉన్న ధాన్యపు రాశులు

తొర్రూరు రూరల్ : ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు అన్నదాతలు నానా అవస్థలు పడుతున్నారు.వాతావరణ హెచ్చరికలతో ధాన్యం నిల్వ చేయలేక అవస్థలు పడుతున్న రైతులు హైరానా పడుతున్నారు. వరి కోతలు ఇప్పటికే పూర్తి కాగా, నగరం ధాన్యం విక్రయాలు జరిగిన తమ గ్రామంలో కొనుగోలు కేంద్రం ప్రారంభం కావడం లేదని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు దాదాపు ప్రారంభమైనా..కంఠాయపాలెం గ్రామంలో మాత్రం ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించ లేదు.ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు కోసం ఎదురు చూసిన రైతులు దిక్కు లేక తమ ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఇప్పటికే ధాన్యం దిగుబడి చేయడంలో చివరకుకు చేరుకున్నప్పటికీ సంబంధిత అధికారుల్లో ఎలాంటి చలనం లేకుండా పోయింది. తద్వారా రైతులు తమ ధాన్యాన్ని వ్యాపారులకు అతి తక్కువ ధరకే విక్రయిస్తూ మద్దతు ధరతోపాటు ప్రభుత్వం ప్రతి క్వింటాకు ఇస్తున్న రూ.500 బోనస్ సైతం నష్టపోతున్నారు. గతంలో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని నిర్వహించగా ఈ ఏడాది మాత్రం గ్రామంలో ప్రభుత్వ స్థలం లేదనే సాకుతో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించ లేదు. ఇవాళ, రేపు ప్రారంభిస్తారని ఆశతో కొంత మంది రైతులు తమ ధాన్యాన్ని పొలాల్లో, రోడ్ల పక్కన ఆరబెట్టుకుంటూ రాశులుగా నిల్వ చేసి ఇంకా వేచి చూస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

‘ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలి’



వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు, నాయకులు

నెహ్రూసెంటర్ : ఆశ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ పచ్చబాయల రజిని, వంగూరి రేణుక, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రేష పల్లి నవీన్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ మురళీధర్‌కు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పద్దెనిమిది ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నామని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్లకు అందించే బోనస్‌లను వెంటనే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు అక్కిర మాధవి, నాగలక్ష్మి, గీత, మహేశ్వరి, కోమలత, సరస్వతి, మంద కర్ తదితరులు పాల్గొన్నారు.

30 పడకల ఆస్పత్రిగా కొత్తగూడ పీహెచ్‌సీ



కొత్తగూడ పీహెచ్‌సీ ఎదుట వైద్యులు, సిబ్బంది

కొత్తగూడ: కొత్తగూడ, గంగారం మండలాల ప్రజల ఎన్నో ఏళ్ల కల నెరవేరింది. స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క చొరవతో సాకారం అయింది. కొత్తగూడ పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ రూ.13.5 కోట్లతో ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. రెండు మండలాల్లో కొత్తగూడ, గంగారం, కోమట్లగూడెం గ్రామాల్లో పీహెచ్‌సీలు మాత్రమే ఉన్నాయి. దీంతో ఎమర్జెన్సీ చికిత్స కోసం కొన్ని గ్రామాల ప్రజలు సుమారు వంద కిలోమీటర్లు వెళ్లాల్సి వచ్చేది. దీంతో కొత్తగూడ పీహెచ్‌సీని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని ఐదు సంవత్సరాల క్రితం ఎమ్మెల్యేగా ఉన్న సీతక్క ప్రభుత్వానికి ఎన్నో సార్లు విన్నవించారు. అయినా అనుమతులు రాలేదు. గతంలో ఇచ్చిన హామీ మేరకు 30 పడకల ఆస్పత్రిగా ప్రభుత్వం నుంచి అనుమతులు రావడంతో రెండు మండలాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పట్టణాల్లోనూ ‘ఉపాధి’ కల్పించాలి

● వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య



మాట్లాడుతున్న వీరయ్య

డోర్నకల్ : పట్టణ ప్రాంతాల్లోనూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు కల్పించి పేదలను ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య కోరారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో శనివారం నిర్వహించిన సంఘ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలలో జాబ్ కార్డులు రద్దు చేయడంతో పనులు లేక యువత ఉపాధి కోసం దూరప్రాంతాలకు వెళ్తున్నారని తెలిపారు. కూలీలకు వెంటనే ఉపాధి పనులు కల్పించాలని, అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మంద రాజన్న, సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్, అన్నెగాని శ్రీనివాస్, నాగేశ్వర్ రావు, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలు అందించాలి

గార్ల : గార్ల సీహెచ్‌సీ, ముల్కనూరు పీహెచ్‌సీల్లో పని చేస్తున్న వైద్యులు, వైద్యసిబ్బంది స్థానికంగా ఉంటూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి జి.సక్రు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్యులు, వైద్యసిబ్బంది సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తూ విధుల పట్ల సమయపాలన పాటించడం లేదన్నారు. దీంతో మండల ప్రజలకు ఆస్పత్రుల్లో సరైన వైద్యం అందక, ఖమ్మం, మహబూబాబాద్ పట్టణాలకు వెళ్లి వైద్యం చేయించుకుంటూ ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సంచార జాతుల అభివృద్ధికి కృషి

● టీపీసీసీ ఓబీసీ స్టేట్ జాయింట్ కోఆర్డినేటర్ పిండ్రాల రాందాసు

మహబూబాబాద్ రూరల్ : సంచార జాతుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని టీపీసీసీ ఓబీసీ స్టేట్ జాయింట్ కోఆర్డినేటర్ పిండ్రాల రాందాసు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు సంచారజాతుల కులాలపై హైదరాబాద్‌లో మాట్లాడిన అంశాలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు కనీసం సంచారజాతుల ప్రజలకు సముచిత స్థానం ఇవ్వని దుస్థితి ఉండేదని, అటువంటి నాయకులు నేడు సంచార జాతుల గురించి మాట్లాడే నైతికత ఉందా అని ప్రశ్నించారు. సమావేశంలో ఉప్పలయ్య, బాలకృష్ణ, గోపి, కుమార్, అజయ్, గంగరాజు, లింగన్న, పాల్గొన్నారు.

గురుకులాల నిర్వీర్యానికి కుట్ర

● కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్‌యాదవ్

డోర్నకల్ : ప్రభుత్వ గురుకులాల నిర్వీర్యానికి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో పాటు బీఆర్‌ఎస్ నేతలు కుట్రలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్ ఆరోపించారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సాంఘిక సంక్షేమ శాఖ (గురుకులాలు) కార్యదర్శిగా పని చేసిన కాలంలో జాబ్ గాలను, టెండర్లను తనకు నచ్చిన వారికి కట్టబెట్టి ఇప్పటికీ గురుకులాలపై ఆధిపత్యం చెలాయిస్తున్నారని ఆరోపించారు. గురుకులాల్లో పని చేస్తున్న తన అనుచరుల ద్వారా గురుకులాల నిర్వీర్యానికి కుట్ర చేస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి గురుకులాల్లో సంస్కరణలు అమలు చేస్తూ విద్యార్థుల మేలు చేస్తుండగా గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కాలా సుమేర్‌చంద్‌జైన్, నాయకులు మాదా శ్రీనివాస్, ఎల్లావుల హరికృష్ణ, నానియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సైకిళ్ల పంపిణీ

మహబూబాబాద్ అర్బన్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఐదు సైకిళ్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు గుడూరు నాగేశ్వర్‌రావు, ఎంఈఓ వెంకటేశ్వర్లు, బాధ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తులు..

చిన్నగూడూరు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం బోధిస్తున్న ఉపాధ్యాయుడు కొలిశెట్టి నాగేశ్వర్ పాఠశాలకు చెందిన విద్యార్థులకు శనివారం క్రీడా దుస్తులను అందజేశారు.

సన్మానం

కురవి : మండలంలోని జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న పదోతరగతి విద్యార్థులకు అల్పాహారం, స్నాక్స్ అందించేందుకు శాశ్వత దాత వేమిశెట్టి చంద్రయ్య ముందుకు వచ్చారు. దాతలు శ్రీరాజరెడ్డి, వేమిశెట్టి చంద్రయ్య దంపతులను హెచ్‌ఎం కాలువతో సన్మానించారు.

‘అద్దంకిని రద్దు చేయాలి’

మహబూబాబాద్ అర్బన్ : ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ పదోన్నతుల్లో అడ్డంకిగా ఉన్న స్వప్నరోపాయాని వెంటనే దానిని రద్దు చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాగంటి ప్రభాకర్ డిమాండ్ చేశారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్‌లో శనివారం సంతకాల సేకరణ నిర్వహించారు. గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అర్చిరాం నాయక్, కోట్యా నాయక్, సిరి నాయక్, లక్ష్మ, శంకర్, రామ్‌దాస్, చంద్ర శేఖర్ ఆజాద్, సంతోష్ పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్: దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వంకాయపాటి చిరంజీవి పిలుపునిచ్చారు. మహాసభ పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. 2025, జనవరి 5, 6, 7 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే జాతీయ మహాసభలకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

డోర్నకల్ : రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మండలానికి చెందిన పదిమంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం బందినర్సింహారావు, పీఈటీలు అభినందించారు.

సెపక్ తక్రా పోటీలకు..

నెల్లికుదురు: రాష్ట్ర స్థాయి సెపక్ తక్రా పోటీలకు నెల్లికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం మిట్టకోలు రవి, వ్యాయామ ఉపాధ్యాయుడు దెబ్బకట్ల బలయ్య తెలిపారు.

విజయవంతం చేయాలి

తొర్రూరు : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నేడు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని జిల్లా అధికార ప్రతినిధి లిక్కెముల మహేష్ అన్నారు.

గొల్లకురుమలను విస్మరిస్తున్న ప్రభుత్వం

దంతాలపల్లి : గొల్లకురుమలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందని జీఎంపీఎస్ మండల అధ్యక్షుడు ఊడుగు బలయ్య అన్నారు. శనివారం పలువురితో కలిసి వినతి పత్రాన్ని తహసీల్దార్ రాజేశ్వర్‌కు అందజేశారు.

మధ్యాహ్న భోజనం బిల్లులు ఇవ్వాలి

నర్సింహులపేట : మధ్యాహ్న భోజనం వండుతున్న ద్వాక్రా మహిళలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ ఎల్.విజయ్ కాంత్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని వారు పరిశీలించారు.

సంక్షిప్త సమాచారం

పీఎఫ్ బకాయి చెల్లించాలి



మరిపెడ : మున్సిపల్ కార్మికుల పీఎఫ్ బకాయిలు చెల్లించాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి డిమాండ్ చేశారు. మరిపెడలో శనివారం ఆయన మాట్లాడుతూ.. సంవత్సర కాలంగా పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించడం లేదన్నారు. చలికాలం తీవ్రంగా ఉండటంతో కార్మికులకు స్వెటర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుడికి రూ. 26వేలు వేతనం చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భిక్షం, రామ్‌లాల్, వీరన్న, వెంకన్న, రవి, ఫూల్‌సింగ్, ఆహార్‌సింగ్, మహేందర్, హరి, నీలమ్మ, పద్మ, వెంకటమ్మ, నాగమణి, సుజాత పాల్గొన్నారు.

పాడుబు సంఘానికి బలోపేతం చేయాలి

మరిపెడ రూరల్ : మహిళ, రైతు పాడుబు సంఘాలను బలోపేతం చేసి, వారి ఆర్థిక ఎదుగుదలకు ప్రోత్సహించాలని ప్రగతి సేవా సమితి వ్యవస్థాపకుడు గద్దల జాన్ అన్నారు. మండలంలోని అబ్బాయిపాలెంలో ప్రగతి సేవా సమితి కార్యాలయంలో మహిళ, రైతు కోఆర్డినేటర్లతో సమీక్ష సమావేశాన్ని శనివారం నిర్వహించారు.

అయ్యప్ప దానంపై అవగాహన

పెద్దవంగర : అవయవ దానంతో మరొకరికి పునర్జన్మ చేకూరుతుందని లయన్స్ క్లబ్ మండల ప్రధాన కార్యదర్శి సురేష్ అన్నారు. అవయవ దానం దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండలంలోని వడ్డెకొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో అవయవ దానంపై విద్యార్థులకు పోటీలతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఉద్యమకారుల నిరసన



కేసముద్రం : తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని శనివారం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం ఎదుట ఉద్యమకారులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల పోరం మండల అధ్యక్షుడు దాగంటి కిషన్ మాట్లాడారు. కట్టమల్లు, షేక్ ఖాదర్, దామరకొండ ప్రవీణ్‌కుమార్, దండు శ్రీనివాస్ పాల్గొన్నారు.

డిమాండ్ల పరిష్కరించాలి

దంతాలపల్లి : రాష్ట్రంలోని భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వంగూరి రాములు అన్నారు. మండల కేంద్రంలోని నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు.

బియ్యం అందజేత

కురవి : మండలంలోని కాంపెల్లి గ్రామానికి చెందిన వెంకట్రాములు, హేమలత దంపతులు మృతి చెందగా వారి పిల్లలు అనాథలుగా మారారు. ఈమేరకు స్పందించిన గంగరబోయిన రఘు దుబాయ్‌లో ఉండే తన స్నేహితుడైన ప్రశాంత్ సహకారంతో 50 కేజీల బియ్యాన్ని బాధిత కుటుంబానికి శనివారం అందజేశారు.

మండల కమిటీ ఎన్నిక

పెద్దవంగర : గొర్రెలు, మేకల పెంపకందార్ల మండల కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొమ్మనబోయిన యాదవ్, ప్రధాన కార్యదర్శిగా కందుల బుచ్చన్న, ఉపాధ్యక్షులుగా కందుల శ్రీశైలం, పాక అనిల్ కుమార్, కోశాధికారిగా కుమ్మరి రాంమూర్తిలను ఎన్నుకున్నారు.

పులి కాదు..జంగ పిల్లి

నర్సింహులపేట: మండలంలోని కౌసల్యదేవిపల్లి శివారు రూప్లాతండా శివారులో గుగులోత్ నరేశ్ వ్యవసాయ భూమిలో పులి రూపంలో కనిపించిన జంతువు జంగ పిల్లిని పోలీస్ స్టేషన్‌లో శనివారం అప్పగించారు. వెంటనే ఎస్సై సురేశ్‌కు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి అడవి పిల్లి (జంగ పిల్లి)గా గుర్తించి తీసుకెళ్లారు.

సినిమా షూటింగ్ సందడి



కేసముద్రం : ఎస్‌వీఎస్ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మిస్తున్న ‘ప్రభుత్వ సారాయి దుకాణం’ అనే సినిమా షూటింగ్‌ను శనివారం మండల కేంద్రంలోని మోహన్ థియేటర్‌లో చిత్రీకరించారు. డైరెక్టర్‌గా నర్సింహారెడ్డి, హీరోలుగా విక్రమ్, వినయ్‌బాబు, నవనీనాన్, నరేష్‌చేడెర్, హీరోయిన్లుగా అతిథి, మోహనశెట్టి, శ్రీలు నటిస్తున్నట్లు చిత్రయూనిట్ తెలిపారు. కాగా నటీనటులతో దియేటర్‌లో కొన్ని దృశ్యాలను చిత్రీకరించారు.

నియామకం

మహబూబాబాద్ రూరల్ : ప్రజాపాలన విజయోత్సవాల నిర్వహణలో కాంగ్రెస్ భద్రాచలం నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి నియమితులయ్యారు.

శ్రీ సాయిరాం ఆస్పత్రిలో డెంటల్ సేవలు..



నెహ్రూసెంటర్ : జిల్లా కేంద్రంలోని శ్రీ సాయిరాం ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన డెంటల్, ఈఎన్‌టీ సేవలను సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజలకు మెరుగైన, ఆధునాతన వైద్య సేవలను అందిస్తున్న ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. వైద్యులు వీరన్న, కృతి, నవీన్, ఆస్పత్రి మేనేజ్‌మెంట్ షేక్ ఉస్మాన్, పెరుగు కుమార్, నిదిగొండ సత్యం, భాగ్యమ్మ, సతీష్‌రెడ్డి, సాజిద్, జానీ పాల్గొన్నారు.

‘తూకంలో మోసాలు అరికట్టాలి’



కొనుగోలు కేంద్రం వద్ద ఏఐకేఎంఎస్ నాయకులు

కొత్తగూడ : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకంలో మోసాలు జరగకుండా ప్రభుత్వ వర్గాలు తీసుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బుర్ర వీరేందర్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పలు కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తూకం ఎక్కువ వేసుకుని రైతులను మోసం చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. నాయకులు బుర్ర వెంకటయ్య, శ్రీశైలం, రాజమల్లు, యుగేందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతో గుర్తింపు

● జిల్లా అదనపు ఎస్పీ చెన్నయ్య



వెంకటరాములును సన్మానిస్తున్న చెన్నయ్య

మహబూబాబాద్ రూరల్ : పోలీసు అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో అందించిన సేవలతో ఉత్తములుగా గుర్తించబడతారని జిల్లా అదనపు ఎస్పీ జోగుల చెన్నయ్య అన్నారు. మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో రైటర్ ఎస్సై గా విధులు నిర్వహిస్తు పదవీ విరమణ పొందిన పి.వెంకటరాములును శనివారం కాలువతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతి రావు, రూరల్ సీఐ సర్వయ్య, ఆర్ అడ్మిన్ అనిల్, రూరల్ ఎస్సై దీపికతో పాటు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



కేసముద్రం: రైతులను సన్మానిస్తున్న సభ్యులు



నెల్లికుదురు: పీఏసీఎస్‌లో..

రైతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పలువురు కొనియాడారు. రైతు పండుగ కార్యక్రమాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో వ్యవసాయశాఖ, పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల వద్ద, రైతు వేదికల్లో వేడుకలు నిర్వహించి రైతులను సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో రైతులు, డైరెక్టర్లు, ఏఈఓలు, ఏఈఓలు, సీఈఓలు, రైతులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

కమిషనర్‌పై చర్య తీసుకోవాలి




నిరసన తెలుపుతున్న భూ బాధితులు

మహబూబాబాద్ అర్బన్ : దళితులకు సంబంధించిన ఇనాం భూమి సర్వే నంబర్ 253లో 6.29 ఎకరాల భూమిలో తాము ప్రహరీ నిర్మాణం చేసుకుంటే ముందస్తు అనుమతి లేకుండా మానుకోట మున్సిపల్ కమిషనర్ కూల్చి వేశారని వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు దాసరి రాములు, చెడిపాక కోడమ్‌లు, ఆరేపల్లి రాములు, పెండ్యాల పద్మ డిమాండ్ చేశారు. మున్సిపల్ పరిధిలోని అనంతారం మున్సిపల్ కార్యాలయ సమీపంలో దళితులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిజాం కాలంలో సాగు చేసేందుకు ఇనాం భూమిని కేటాయించారన్నారు. ఇటీవల సొంతంగా తాము ప్రహరీ నిర్మించామని, తమ వద్ద అన్ని పత్రాలు ఉన్నాయని చెప్పారు. అయిన కక్షపూరితంగా ప్రహరీని కూల్చివేశారన్నారు. వెంటనే మున్సిపల్ కమిషనర్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టర్, పురపాలక రీజనల్ డిప్యూటీ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, తమకు న్యాయం చేయాలన్నారు. దాసరి గోపాల్, శ్రీనివాస్, పుష్పబాయి బాలకృష్ణ, అనిల్, వెంకటమ్మ, వెంకయ్య, అనిత, హేమలత, ఏలేంద్ర, సుజాత తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం



గార్ల: రాస్తారోకో చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు



మహబూబాబాద్ అర్బన్: మదర్‌థెరిసా సెంటర్‌లో..

విద్యారంగ సమస్యలపై ఆయా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ జిల్లా వ్యాప్తంగా విజయవంతమైంది. ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూల ఆధ్వర్యంలో పాఠశాలల బంద్ నిర్వహించారు. విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్